

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## ఆదర్శ పాఠశాలలో 'శిక్షా సపత్'

జక్రాన్‌పల్లి, జూలై 28 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఈసీవో క్లబ్ ఆధ్వర్యంలో శిక్షా సపత్-2024 ఉత్సవాల్లో భాగంగా మిషన్ లైఫ్ అండ్ స్కూల్ న్యూట్రిషన్ డేను ఆదివారం నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్, రంగోలీ, చిత్రలేఖనం, మొక్కలను నాటే కార్యక్రమాలను చేపట్టారు. వివిధ ఆహార పదార్థాలు, వాటిలోని పోషక విలువలు, మొక్కల ప్రాముఖ్యతపై ఈసీవో క్లబ్ సభ్యులు విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ వట్టి బూటకం'

ఖలీల్‌వాడి, జూలై 28 : మోదీ ప్రభుత్వం చెప్పే సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదం వట్టి బూటకమేనని, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రుజువు చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. బోధన్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలుచేయడంతో పదేండ్లుగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటి బడ్జెట్‌లో కూడా నిధులను కేటాయించకపోవడం బీజేపీ వైఖరిని అద్దం పడుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని అన్నారు. సమావేశంలో నాయకులు శంకర్‌గౌడ్, గంగాధర్, నన్నేసాబ్, బాలయ్య, గంగాధర్, సాయిలు పాల్గొన్నారు.

## డ్యూయెట్, అచీబు పురుగు మందుల ఆవిష్కరణ

ఖలీల్‌వాడి, జూలై 28 : జిల్లాకేంద్రంలోని వంశీ హోటల్‌లో పురుగు మందుల డీలర్ల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో జపాన్ దేశానికి చెందిన డ్యూయెట్, అచీబు పురుగు మందులను జపాన్ కంపెనీ ప్రతినిధి తోమై.. కంపెనీ ఇండియా ప్రతినిధులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ప్రతి ఏడాది రెండు నూతన ఉత్పత్తులు తీసుకువస్తామని ఆయన చెప్పారు. భారతదేశం చాలా గొప్ప దేశమని, దేశానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇండియా చైర్మన్ తుముక, డైరెక్టర్ వెంకటసాయి, నేషనల్ సేల్స్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, ఉపేంద్ర, ప్రమోద్‌రెడ్డి, వినయ్‌కుమార్, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

## విద్యారంగానికి నిధులు పెంచాలి

ఆర్మూర్‌టౌన్, జూలై28: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులు పెంచాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని అన్నారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చూడాలని కోరారు.

## పోలీసులమంటూ బెదిరింపు కాల్

● రూ.పదివేలు పంపాలని డిమాండ్

ఆర్మూర్‌టౌన్, జూలై28: ఆలూర్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అంజలి అనే మహిళకు ఆదివారం ఉదయం క్రైమ్ పోలీసులమంటూ సైబర్ నేరగాళ్లు వాట్సప్ కాల్ చేసి బెదిరించారు. 'నీ పేరు అంజలి కదా.. మీ నాన్న పేరు పెంటన్న బహెరాన్‌లో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు' అని అన్నారు. ఆయనను వదిలి వేయాలంటే రూ.పది వేలు ఫోన్‌పే ద్వారా పంపాలని డిమాండ్ చేశారు. ఆమె ఆ విషయాన్ని ఇంటి ముందున్న అనిల్ అనే యువకుడికి చెప్పింది. తర్వాత యువకుడు వాట్సాప్ నంబర్‌కు కాల్ బ్యాక్ చేసి బహెరాన్‌లో ఉన్న పెంటన్నను చూపించాలని కోరగా సైబర్ నేరగాడు ఫోన్ కాల్ కట్ చేశాడు. అంజలి తన నాన్నతో ఫోన్‌లో మాట్లాడి జరిగిన ఘటనను తెలుపగా అలాంటిది ఏమీ జరుగలేదని తన తండ్రి చెప్పాడు. ఇది సైబర్ నేరగాళ్ల పని అయి ఉంటుందని గుర్తించారు. విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

## రిటైర్డ్ ఉద్యోగి శరీరదానం



రామ్‌కిషన్(ఫైల్)

బోధన్, జూలై 28: బోధన్ మున్సిపల్ పట్టణం ఆచన్‌పల్లికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రామ్‌కిషన్(83) తన మరణానంతరం శరీరదానం చేశారు. వ్యవసాయశాఖలో సుదీర్ఘకాలం ఉద్యోగిగా పనిచేసిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సంతానం లేకపోవడంతో ఆయన తన సోదరుడి కుమారుడు విశ్వప్రసాద్, కుమార్తెలు విమల, విజయగంగ ఆలనా పాలనలో శేష జీవితం గడిపారు. నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో శనివారం ఆయన మృతి చెందగా శనివారం రాత్రి నిజామాబాద్ మెడికల్ కళాశాలకు రామ్‌కిషన్ భౌతికకాయాన్ని అప్పగించారు. గతంలో రామ్‌కిషన్ తన శరీరాన్ని తన మరణానంతరం దానం చేస్తానని తమకు ప్రమాణపత్రం ఇచ్చారని తెలంగాణ శరీర, అవయవ దాన సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి తెలిపారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★WANTED HOME TUITION TEACHER for 1st and 3rd Class Students in Nizamabad Town Contact No: 8793032690

NTZ-340199

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# అడుగుకో గుంత..

● చందూర్ - లక్ష్మాపూర్ దుస్థితి
● ప్రయాణికులకు నరకయాతన



గుంతలమయంగా మారిన చందూర్ - లక్ష్మాపూర్ రోడ్డు

చందూర్, జూలై 28 : చందూర్ బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే (చందూర్ - లక్ష్మాపూర్) రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షపునీరు గుంతల్లో చేరడంతో ఎక్కడ ఏ గుంత ఎంత లోతులో ఉన్నదో ప్రయాణికులకు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చందూర్ మండలకేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే వారు ఈరోడ్డు మీదుగా రోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తారు. విద్యార్థులు కాలినడకన వెళ్తుండగా.. ఏదైనా పెద్ద వాహనం ఈ గుంతల రోడ్డు మీదుగా వెళ్తే వారిపై బురద చిల్లడం సాధారణమైపోయింది. ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారు కూడా గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు.

**గత ప్రభుత్వం రోడ్డు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ..**

గత ప్రభుత్వం ఈ రోడ్డు పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అప్పట్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చందూర్ నుంచి జలాల్‌పూర్ వరకు రూ. 16 కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అధికారులు కొలతలు చేపట్టడంతో గ్రామస్తులు సంబురపడ్డారు. కానీ ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా నేటికీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని త్వరగా రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### రోడ్డును జల్ది వేయాలి



చందూర్‌లో ఈ రోడ్డుపై నుంచి వెళ్లడం నరకంగా మారింది. ఇసుంటి పరిస్థితి నేనెప్పుడూ సూడలె. ఒకప్పుడు మట్టి రోడ్డు ఉన్నప్పుడు మొరం పోస్తే వర్షాకాలం ఎల్లిపోతుండె. ఈ రోడ్డుకు జల్లెడకు రంధ్రాలు ఉన్నట్లు అడుగడుగునా గుంతలే ఉన్నాయి. మొన్నటిదాక రోడ్డు ఏస్తామని అని పనులు ఆపేశారు. రోడ్డును జల్ది వేయాలి.

- మాగిరి లక్ష్మన్, చందూర్ గ్రామం

### కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి



నేను మా గ్రామం నుంచి నిత్యం చందూర్‌కు ఏదో ఒక పని మీద వెళ్తాను. ఈ రోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందిగా మారింది. రోడ్డు, ఇరుకుగా ఉండి గుంతలు పడడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో గుంతల్లో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించాలి.

- గంగడోళ్ల గంగారాం, ఘన్‌పూర్

## గుంతలమయంగా ఎత్తొండ - పెంటాకుర్దూ రోడ్డు



గుంతలమయంగా మారిన ఎత్తొండ - పెంటాకుర్దూ రోడ్డు, చిత్తడిగా మారిన కోటగిరి ప్రభుత్వ దవాఖాన వెనుక వైపు నుంచి కొత్తపల్లికి వెళ్లే రోడ్డు

కోటగిరి, జూలై 28 : కోటగిరి మండలంలోని ఎత్తొండ నుంచి పెంటాకుర్దూ ఎక్స్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు మీదుగా రోజూ వందలాది మంది ఎత్తొండ, బోధన్, వల్లభాపూర్‌కు వెళ్తారు. మోకాలిలోతు గుంతలు పడి, వర్షపు నీరు నిండడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై గుంతలు పడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. కోటగిరి మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వెనుకవైపు నుంచి కొత్తపల్లికి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## చినుకుపడితే చిత్తడే..



చిత్తడిగా మారిన చీమన్‌పల్లి -తాటిపల్లి రోడ్డు



బురదమయంగా మారిన ఆదర్శపాఠశాలకు వెళ్లే దారి

సిరికొండ / రుద్రూర్, జూలై 28 : సిరికొండ మండలంలోని చీమన్‌పల్లి -తాటిపట్టి వెళ్లే దారిలో గుడిపేట నుంచి శాంతినగర్ వరకు రోడ్డు చిత్తడిగా మారింది. సిరికొండ నుంచి వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్‌కు పెద్దసంఖ్యలో వాహనాలు వెళ్తాయి. సిరికొండ నుంచి తాటిపల్లి వరకు డబుల్ బీటీ రోడ్డువేశారు. మధ్యలో రెండు కిలోమీటర్ల మేర నిలిపివేయడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయంగా మారి, ప్రయాణం కొనసాగించకుండా తయారైంది. దీంతో వన్‌పల్లి మీదుగా రావాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

రుద్రూర్ మండలపరిధిలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. నడుచుకుంటూ, సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డును వెంటనే బాగు చేయించాలని ఏబీవీపీ ఉమ్మడి మండలాల కార్యదర్శి దర్శనం ప్రవీణ్ కోరారు.

## బస్టాండ్ ఆవరణలో గుంతలు



గుంతలమయంగా పొతంగల్ బస్టాండ్ ఆవరణ

పొతంగల్, జూలై 28 : పొతంగల్‌లోని బస్టాండ్ ప్రాంగణం వద్ద ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. వర్షాలకు బస్టాండ్ పరిసర ప్రాంతంతోపాటు పీహెచ్‌సీ వద్ద రోడ్లు గుంతలమయంగా మారి, వర్షపు నీరు నిలిచింది. బస్టాండ్‌కు, పీహెచ్‌సీకి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను పూడ్చి, మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఇంత నిర్లక్ష్యమా?



రెంజల్ మండలంలోని కందకుర్తి జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం, ప్రాథమిక పాఠశాల ఆవరణలో గుంతలు ఏర్పడి, అందులో వర్షపు నీరు నిలిచింది. పిచ్చి గడ్డి పెరగడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకముందే సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– రెంజల్, జూలై 28



మంచిప్పలో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



సాలూరాలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

# ఘనంగా బోనాల ఊరేగింపు



ఆర్మూర్‌లోని మహాలక్ష్మీ ఆలయం వద్ద భక్తుల పూజలు..



రుద్రూర్‌లో బోనాల పండుగలో పాల్గొన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివారెడ్డి, ఆగ్రోఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు



ఆచన్‌పల్లి 1వ వార్డులో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ..

చందూర్/ డిచ్‌పల్లి/ మోపాల్ (ఖలీల్‌వాడి)/ రుద్రూర్/ నందిపేట్/ ఆర్మూర్‌టౌన్/ మోర్తాడ్/ బోధన్ రూరల్/ శక్కర్‌నగర్/ ఎడపల్లి, జూలై 28 : వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలను గ్రామాల్లో ఊరేగించారు. గ్రామదేవతలకు యాటలను బలి ఇచ్చి, నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వన భోజనాలకు వెళ్లారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ), ధర్పల్లి మండలకేంద్రంతోపాటు సీతాయిపేట్, మోపాల్ మండలం మంచిప్ప, కోటగిరి మండలం ఎత్తొండ, రుద్రూర్, సులేమాన్‌నగర్ ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రోఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు హాజరై బోనాలను ఊరేగించారు. ఆర్మూర్ పట్టణంలో నల్ల పోచమ్మ ఆలయంలో గ్రామ దేవతలకు మొక్కులను చెల్లించుకున్నారు. గోవింద్‌పేట్‌లో వీడీసీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గంగాజలంతో అభిషేకాలు చేశారు. డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ గ్రామంలో తాత, ఆయి పండుగ వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో కులసంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. వనభోజనాలకు తరలివెళ్లారు. సాలూర మండల కేంద్రం, బోధన్ మండలంలోని భవానిపేట్ , బోధన్ ఆచన్‌పల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలు తీశారు. ఆర్టీసీ కాలనీలో బోనాల పండగ నిర్వహించారు. ఎడపల్లి, బాపునగర్, పోచారం, జైతాపూర్, మంగళ్‌పాడ్, కుర్నాపల్లి, ఠానకలాన్, అంబం, ఓడ్డపల్లి తదితర గ్రామాల్లో వనభోజనాలకు వెళ్లారు.



ఎత్తొండలో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

## జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు

కంఠేశ్వర్, జూలై 28 : హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 27, 28వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో జిల్లాకు చెందిన కెడెట్‌బాయ్స్ అండ్ గర్ల్స్ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తైక్వాండో జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రుత్విక, సిద్ధార్థ, భవ్య, వినయ్ పథకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 1, 2, 3వ తేదీల్లో వైజాగ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో అక్షరాస్ శ్రీనిధి, వినాయక్ రాథోడ్, వర్షిని పథకాలు సాధించినట్లు తెలిపారు.

## ఊరపండుగకు కట్టుదిట్టమైన భద్రత..



బందోబస్తులో పాల్గొన్న పోలీసులు

వినాయక్‌నగర్, జూలై 28: ఊరపండుగ నేపథ్యంలో జిల్లాకేంద్రంలో సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఖిల్లా చౌరస్తా నుంచి దేవతామూర్తుల ఊరేగింపు వరకు ఎక్కడా ఆటంకాలు కలుగకుండా దారిపొడవునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక పికెట్‌ను ఏర్పాటు చేసి, పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. ఏసీపీ రాజావెంకటరెడ్డి పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణతోపాటు సీఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ, ఐడీ పార్టీ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.

**స్వల్ప లాఠీచార్జీ**

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపుతోపాటు పవిత్ర ప్రసాదమైన (సరి) గంపను సైతం వెంట తీసుకొని వెళ్తారు. సరిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉత్సాహంతో భక్తులు, యువకులు ఒక్కసారిగా గంప ఎత్తుకున్న వ్యక్తిపై విరుచుకుపడ్డారు. ఈక్రమంలో తోపులాట జరగగా ఓ యువకుడికి తలపగిలి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. పరిస్థితి చేయి జారుతుండడాన్ని గమనించిన పోలీసులు స్వల్ప లాఠీ చేసి పరిస్థితిని అదుపుచేశారు.

## ఆగస్టు 3 నుంచి రాష్ట్రస్థాయి క్యారం పోటీలు

కంఠేశ్వర్, జూలై 28 : మందుల హన్మాండ్లు స్మారకార్థం ఆగస్టు 3 నుంచి రాష్ట్రస్థాయి క్యారం పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్యారం అసోసియేషన్ అధ్యక్షుడు క్యాతం సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమ్‌గల్‌లోని జేబీఎన్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో మెన్ సింగిల్స్, ఉమెన్స్ సింగిల్స్, మెన్ డబుల్స్ ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు శోభన్‌రాజ్ 94403 07023 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## సంక్షిప్తంగా..

● **ఘనంగా వివాహ ఆదివారం** - డిచ్‌పల్లి, జూలై 28 : బర్ధిపూర్‌లో ఉన్న సీఎస్ఐ వెస్లీ చర్చిలో ప్రెస్బిటర్ ఇన్‌చార్జి, జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవ. దివాకర్ ఆధ్వర్యంలో వివాహ ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహ వ్యవస్థపై ప్రత్యేక సందేశాలు అందించారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

● **వర్షానికి కూలిన ఇండ్ల పరిశీలన** - కోటగిరి, జూలై 28: ఎత్తొండలో వర్షానికి దెబ్బతిన్న ఇండ్లను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషిచేస్తానని హామీ చెప్పారు. అనంతరం ఎత్తొండలో బోనాల పండుగలో పాల్గొన్నారు.

● **అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి** - కోటగిరి, జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు, సుధాకర్, విఠల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అర్హులకు పథకాలు అందించేందుకు సీపీఐ కృషి చేస్తున్నదన్నారు.

● **కుక్కల బెడదను నివారించాలి** - మోర్తాడ్, జూలై28: మండలకేంద్రంలోని తక్కూరివాడ హనుమాన్ మందిర్ వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటిని నివారించాలని స్థానికులు జీపీ కార్యదర్శిని కోరారు. బైక్‌పై వెళ్లేవారిని వెంబడించి గాయపరుస్తున్నాయని, పిల్లలపై దాడి చేస్నున్నాయని అధికారులకు ఇప్పటికే రెండుసార్లు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

● **నేడు చాగంటి ప్రవచనం** - బోధన్, జూలై 28: పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌కు ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు సోమవారం రానున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 'విలువలతో కూడిన విద్య' అనే అంశంపై ప్రవచనం ఇస్తారని ఆ హైస్కూల్ ప్రిన్సిపాల్ శంకరమంచి కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● **తల్లిదండ్రులకు సన్మానం**- శక్కర్‌నగర్, జూలై28: లైయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అపెక్స్ వైట్ ఆధ్వర్యంలో నేషనల్ ఫేరెంట్స్‌డే సందర్భంగా సీఎస్ఐ చర్చి రాకాసిపేట్‌లో తల్లిదండ్రులను పిల్లలు సన్మానించారు. క్లబ్ ప్రెసిడెంట్ లయన్ లంక జరూస, జోన్ చైర్‌పర్సన్ లయన్ లంక రవి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

● **'ఆలయాల వద్ద హలాల్ నిషేధం'**- ఆర్మూర్‌టౌన్, జూలై28: పట్టణంలోని గ్రామ దేవతల ఆలయాల వద్ద హలాల్ చేయడాన్ని నిషేధిస్తున్నామని సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హలాల్ నిషేధాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆ పార్టీ నాయకులు సర్వసమాజ్ అధ్యక్షుడిని సన్మానించారు.



బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామ తండాలో గిరిజనులు తీజ్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెండ్లికాని గిరిజన యువతులు తొమ్మిది రోజుల పాటు నియమ నిష్ఠలతో వెదురు బుట్టల్లో పెంచిన గోధుమ నారును సంప్రదాయాల ప్రకారం చెరువులో నిమజ్జనం చేశారు. బోధన్ రూరల్ సీఐ నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – బోధన్ రూరల్, జూలై 28

## 'బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి'

మాక్లూర్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామావత్ సురేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 23 శాతం నుంచి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన చేపట్టి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

## కుర్చీని కాపాడుకోవడమే బీజేపీ లక్ష్యం

శక్కర్‌నగర్, జూలై28: సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ కార్యక్రమం వట్టి బూటకమని, కుర్చీని కాపాడుకోవడమే బీజేపీ లక్షమని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. ఆదివారం బోధన్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్‌గౌడ్, ఏరియా కార్యదర్శి వేషాల గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నన్నెసాబ్, బోధన్ ఏరియా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వరద

రెంజల్, జూలై 28: మండలంలోని కందకుర్తి వద్ద గోదావరినదిలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. పురాతన శివాలయం చుట్టూ నీటి నిలిచి ఉంది. మండలంలో శనివారం నుంచి ఆదివారం వరకు 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్ 2001-2002 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను స్మరించుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. –బాల్కొండ, జూలై28



మోస్రాలోని ప్రభుత్వ పాఠశాలలో 2003-2004లో ఎస్సెస్సీ చదువుకుతున్న విద్యార్థులు అదేపాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. – మోస్రా (చందూర్), జూలై 28

## పదోతరగతి విద్యార్థి అదృశ్యం



నవీపేట, జూలై 28: స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అంజూమాన్‌ఫారం గ్రామానికి చెందిన కడారి అశోక్(15) శనివారం ఉదయం స్కూల్‌కు వెళ్తున్నాని చెప్పి పుస్తకాల బ్యాగ్‌తో ఇంటి నుంచి బయల్దేరాడు. నవీపేటకు వచ్చి తోటి విద్యార్థికి తనకు ఇక్కడ చదువుకోవడం ఇష్టం లేదని చెప్పాడు. తాను ఇప్పుడే వస్తానని చెప్పి బ్యాగ్‌ను అప్పజెప్పి వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో తోటి విద్యార్థులు ఉపాధ్యాయుల ద్వారా ఇంటికి సమాచారం అందించారు. అశోక్ హైదరాబాద్‌లో 8,9 తరగతులు చదివాడు. విద్యార్థి తండ్రి తిరుపతి బతుకు దెరువు కోసం గల్ఫ్‌వెళ్లాడు. తల్లి కడారి జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## న్యాయవాదికి సన్మానం

శక్కర్‌నగర్, జూలై28: ఇటీవల బోధన్ న్యాయ స్థానంలో ఏజీపీగా నియమితులైన న్యాయవాది రవీందర్‌ను ఆదివారం మున్నూరు కాపు సంఘం సభ్యులు పట్టణంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మసూల్ శ్రీనివాస్ పెద్ద కాపు, సాయిలు, శ్రీరామ్ సాయిలు, చక్రేశ్వర శివ మందిర్ మాజీ చైర్మన్ బీర్కూర్ శంకర్ తదితరులు ఉన్నారు.